యాచారంలో మోస్తరు వర్షం



యాచారం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని యాచారం, నందివన పర్తి, చౌదర్‌పల్లి, గున్‌గల్ తదితర గ్రామాలలో మంగళవారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. 40 నిమిషాల పాటు వర్షం కురియడంతో దుక్కులు దున్నుకోవచ్చని రైతులు సంబురపడ్డారు.



మీసేవ కియోస్క్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

మీసేవ కియోస్క్‌తో స్వయంసేవ సులభతరం

కలెక్టరేట్‌లో ప్రారంభించిన కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మీసేవ కియోస్క్‌తో స్వయంసేవ ఇక మరింత సులభతరం చేసుకోవచ్చని కలెక్టర్ సి. నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని గ్రౌండ్‌ఫ్లోర్‌లోని ప్రజాపాలన కేంద్రంలో మీసేవ కియోస్క్ యంత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యంత్రం ద్వారా జనన, మరణ ధ్రువీకరణ, కుల, ఆదాయ సర్టిఫికెట్లను తక్షణమే ప్రింట్ తీసుకోవచ్చని తెలిపారు. విద్యుత్ బిల్లు, నీటి బిల్లు, ఇతర బిల్లుల పేమెంట్ చేసుకోవచ్చని చెప్పారు. మీసేవ కియోస్క్ మిషన్ విద్యుత్ కోతల సమయంలో 180 నిమిషాల పవర్ బ్యాకప్‌తో సేవలు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో సునీల్, ఈడీఎం భానుప్రకాశ్ పాల్గొన్నారు.

క్లాత్ బ్యాగులను ఆవిష్కరణ

ప్లాస్టిక్‌ను నివారించేందుకు క్లాత్ బ్యాగ్‌ల వినియోగం పెరగాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో క్లాత్ బ్యాగ్‌లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా ఎన్విరాన్మెంటల్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్ (ఈపీవో) క్లాత్ బ్యాగ్‌లను తయారు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఈపీవో రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య, ఆర్గనైజర్లు పి. శివకుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



పండ్లు, కూరగాయలను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీలత

తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం

» డీఆర్‌డీఏ పీడీ శ్రీలత

మహేశ్వరం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : పుట్టిన ప్రతీ బిడ్డకు ముర్రుపాలు, ఆ తర్వాత ఆరు నెలలు తల్లిపాలు పట్టిస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని డీఆర్‌డీఏ పీడీ శ్రీలత సూచించారు. ఐసీడీఎస్ మహేశ్వరం ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషణపక్షం ముగింపు కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిడ్డకు రెండేళ్లలోపు తీసుకోవాల్సిన టీకాలు తప్పక వేయించాలన్నారు. ముఖ్యంగా ప్రాంతీయంగా అందుబాటులో ఉండే చిరు ధాన్యాలను పిల్లలకు అందించే విధంగా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో శాంతిశ్రీ, ఎంపీడీవో శైలజ పాల్గొన్నారు.

అమ్మాయిలు అదుర్స్!

ఇంటర్ ఫలితాల్లో బాలికల హవా

ఇంటర్మీడియెట్ రిజల్ట్స్ మంగళవారం విడుదలయ్యాయి. ఫస్టియర్, సెకండియర్ ఫలితాలు ఒకేసారి విడుదల చేశారు. ఈ ఫలితాల్లో అమ్మాయిలు అదుర్స్ అనిపించారు. అన్ని గ్రూపుల్లో ఉత్తమ మార్కులు సాధించి సత్తా చాటారు. ఎప్పటిలాగే బాలుర కంటే బాలికలు పైచేయి సాధించారు. అలాగే ఫస్టియర్ ఫలితాల్లో జిల్లాకు రాష్ట్రంలో రెండో స్థానం దక్కగా, సెకండియర్‌లో నాలుగో స్థానంలో నిలిచింది. గతేడాది కంటే ఈసారి ఒక్కో స్థానాన్ని కోల్పోయింది. అయితే ఒకేషనల్‌లో గతంలో కంటే ఈసారి ఉత్తీర్ణత శాతం మెరుగైంది.



- అన్ని గ్రూపుల్లో ముందంజ
- రాష్ట్రంలో జిల్లాకు రెండో స్థానం
- సెకండియర్‌లో నాలుగో స్థానం
- గతేడాది కంటే తగ్గిన ఒక స్థానం
- ఒకేషనల్‌లో పెరిగిన ఉత్తీర్ణత
- మే22 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ



సభావత్ పూజ
ఎంపీసీ ఫస్టియర్ -430
టీజీఎంఎస్ గున్‌గల్,
యాచారం మండలం



బొల్లపల్లి మానస
ఎంపీసీ సెకండియర్
మార్కులు :
979/1000



ఎలగమోని పూజ
బైపీసీ ఫస్టియర్- 385
కొత్తపేట జూనియర్
కళాశాల, మం.కేశంపేట



ముస్కాన్ (స్టేట్‌ర్యాంక్)
బైపీసీ 992/1000
ఆదర్శ జూనియర్
కళాశాల, నేదునూరు



బి.సారిక
సీఈసీ 417/500
కొత్తపేట ప్రభుత్వ
జూనియర్ కళాశాల



రంగు సింధు ప్రియ
సీఈసీ 890/1000
కొత్తపేట ప్రభుత్వ
జూనియర్ కళాశాల

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఎప్పుడెప్పుడా అని ఉత్కంఠగా ఎదురు చూసిన తెలంగాణ ఇంటర్ ఫస్ట్ ఇయర్, సెకండియర్ ఫలితాలు రానే వచ్చేశాయ్. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు నాంపల్లిలోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితారానా, ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య ఫలితాలను విడుదల చేశారు. ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ ఫలితాలు ఒకేసారి విడుదల చేశారు. ఈ ఫలితాల్లో బాలికలు సత్తా చాటారు. అన్ని గ్రూపుల్లో బాలికలే ముందంజలో ఉన్నారు. ఇంటర్ ఫలితాల్లో తప్పిన విద్యార్థులకు మే 22 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు.

ఇంటర్ మొదటి సంవత్సరంలో 76,967 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 59,227 మంది పాస్ అయ్యారు. రంగారెడ్డి జిల్లా 76.95 ఉత్తీర్ణతా శాతం రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచింది. ఇంటర్ సెకండియర్‌కు సంబంధించి 67,586 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 52,526 మంది పాస్ అయ్యారు. 77.72 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో జిల్లా నాలుగో స్థానాన్ని పదిలం చేసుకుంది. ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో రంగారెడ్డి జిల్లా గత ఏడాది

మిగతా 8వ పేజీలో...

బాలికలదే పైచేయి..

ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ఈ సారి కూడా బాలికలదే హవా కొనసాగింది. జిల్లాలో ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ రెండింటిలోనూ బాలికలే పైచేయిగా నిలిచారు. ఇంటర్ ఫస్టియర్‌లో 39,503 మంది బాలురు పరీక్షలు రాయగా 28,537 మంది పాసయ్యారు. 72.24 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అలాగే 37,464 మంది బాలికలు పరీక్షలు రాయగా 30,690 మంది పాస్ అయ్యారు. 81.92 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇంటర్ సెకండియర్‌లో 34,884 మంది బాలురు పరీక్షలు రాయగా 25,711 మంది పాస్ అయ్యారు. 73.70 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 32,702 మంది బాలికలు పరీక్షలు రాయగా 26,815 మంది బాలికలు పాస్ అయ్యారు. 82 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో.. మూడేళ్ల ఫలితాల వివరాలు

సంవత్సరం	హాజరు	పాస్	శాతం	ర్యాంకు
2023	68,289	50,433	73	2
2024	71,297	51,121	71.7	1
2025	76,967	59,227	76.95	2

సెకండియర్‌లో..

సంవత్సరం	హాజరు	పాస్	శాతం	ర్యాంకు
2023	53,050	38,911	73	5
2024	64,759	50,273	77.63	3
2025	67,586	52,526	77.72	4

సూర్యప్రతాపం!

ఉమ్మడి జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు



నిర్మానుష్యంగా తాండూరు ఇందిరా చౌక్



- వడగాలులతో జనజీవనం అస్తవ్యస్తం
- వికారాబాద్ జిల్లాలో అత్యధికంగా 42.7 డిగ్రీలు
- పగలు ఉక్కబోతలతో సతమతం
- మరో 3 రోజులూ పెరగనున్న ఉష్ణోగ్రతలు
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

గత రెండు రోజుల ఉష్ణోగ్రతలు (సెంటీగ్రేడ్‌లలో)

జిల్లా	సోమ	మంగళవారం
రంగారెడ్డి	41.9	42.1
వికారాబాద్	41.2	42.7
మేడ్చల్	42.4	41.7

ఉమ్మడి జిల్లాలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. వరుసగా రెండో రోజు కూడా పలు చోట్ల 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం నుంచే భానుడు సెగలు కక్కుతుండడంతో 11 గంటలకే ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరుకుంటున్నాయి. దీంతో జనం రోడ్లమీదకు వచ్చేందుకు జంకుతున్నారు. మధ్యాహ్నం రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉష్ణోగ్రతలు పెరగడంతో భవన కార్మికులు, ఉపాధి కూలీలు పనులకు వెళ్లేందుకు సైతం వెనకాడుతున్నారు. మండుతున్న ఎండలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం వేళలో పాఠశాలలకు వస్తున్నా.. మధ్యాహ్నం పాఠశాల నుంచి ఇళ్లకు వెళ్లే సమయంలో మండుతున్న ఎండల బారిన పడుతున్నారు.

వికారాబాద్/మేడ్చల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఈ సీజన్‌లో ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో సోమ, మంగళవారాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వికారాబాద్ జిల్లాలో మంగళవారం అత్యధికంగా 42.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే రంగారెడ్డి జిల్లాలో 42.1 డిగ్రీలు, మేడ్చల్ జిల్లాలో 41.7 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రంగారెడ్డి జిల్లా గండిపేట, షాబాద్, అబ్దుల్లాపూర్‌మెట్, మహేశ్వరం, మెయినాబాద్, శంకరపల్లి మండలాల్లో 42 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే వికారాబాద్ జిల్లాలోని బంట్వారం, దుద్యాల, కొడంగల్,

మిగతా 7వ పేజీలో...

భూ భారతి పోర్టల్‌తో అక్రమాలకు చెక్

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ధరణి పోర్టల్‌తో చాలా మంది రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి పోర్టల్‌తో అలాంటి అక్రమాలకు తావుండదని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు. ఆధార్‌కార్డు మాదిరిగా రైతులకు భూధార్‌ను అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. మంగళవారం యాచారం మండల కేంద్రంలో భూ భారతి పోర్టల్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు.

దోపిడీదారుల భరతం పడతాం..

ఫార్మాసిటీ భూసేకరణలో దోపిడీదారుల భరతం పడతామని, ఎంతటి వారినైనా ఊపేక్షించేదిలేదని ఎమ్మెల్యే హెచ్చరించారు. రైతులకు పరిహారం అందజేయడంలో అక్రమాలకు పాల్పడిన వారిపై విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామన్నారు. ఫార్మాసిటీ రద్దుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. 2500 ఎకరాల భూమిపై కోర్టులో ఉన్న కేసుల విషయం సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. అనంతరం యాచారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. డీసీసీబీ చైర్మన్ కొత్తకురుమ సత్తయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్‌రెడ్డి, ఆర్‌డీవో అనంతరెడ్డి, తహసీల్దార్ అయ్యప్ప, చంద్రశేఖర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, రామకృష్ణ పాల్గొన్నారు.

దేశానికి సేవచేసే అదృష్టం లభించింది

యూపీఎస్సీలో 739 ర్యాంక్ » సివిల్స్ ర్యాంకర్ ఇంద్రార్చిత



తల్లిదండ్రులతో ఇంద్రార్చిత

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): చిన్ననాటి కల నెరవేరింది.. దేశానికి సేవచేసే అదృష్టం వరించింది.. అమ్మానాన్నలను అమితానందపర్చిన వేళ ఎంతో సంతోషంగా ఉందని యూపీఎస్సీ (యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్) ర్యాంకర్ ఇంద్రార్చిత సంతోషాన్ని వ్యక్తం చేసింది. షాద్‌నగర్ పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన బేకరి వ్యాపారి రాఘవేందర్‌రావు, మమత కుమార్తె ఇంద్రార్చిత యూపీఎస్సీలో 739వ ర్యాంక్ సాధించింది. ఈ విషయం తెలియగానే మంగళవారం రాఘవేందర్‌రావు కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు వచ్చి ఇంద్రార్చితతో పాటు ఆమె తల్లిదండ్రులను సన్మానించి, అభినందనలు తెలిపారు. విద్యార్థి దశ నుంచి సివిల్స్ రాయాలన్న తలంపుతో ఉన్న ఇంద్రార్చిత ప్రాథమిక విద్యను స్థానిక మాంటిస్సోరి పాఠశాలలో చదివింది. 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు పాపిరెడ్డిగూడ గ్రామ శివారులో ఉన్న హెరిటేజ్‌వాల్యు పాఠశాలలో, బీఏ ఎకనామిక్స్ హైదరాబాద్‌లోని సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాలలో, ఎంఏ పొలిటికల్ సైన్స్ ఢిల్లీలోని ఇగ్నో కళాశాలలో పూర్తి చేసింది. సివిల్స్ సాధించాలన్న పట్టుదలతో గత ఆరేళ్ల నుంచి పరీక్షలు రాస్తూ వస్తున్న ఇంద్రార్చిత రెండవ ఇంటర్వ్యూలో విజయం సాధించింది. తాను పొందిన 739వ ర్యాంకుకు ఐఆర్ఎస్ ఉద్యోగం వస్తుందని, ఉద్యోగంలో చేరి, ఐఏఎస్ పొందాలన్న లక్ష్యంతో ఉన్నానని ఇంద్రార్చిత తెలిపారు.

ప్రశ్నించే వారిపై ఈడీ, సీబీఐ దాడులు

- » భయభ్రాంతులకు గురిచేస్తున్న కేంద్రం
- » పోరాటాలతోనే కార్మికుల సమస్యలు పరిష్కారం
- » ఎమ్మెల్సీ నెలికంటి సత్యం



రాష్ట్ర మహాసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెలకంటి సత్యం

శంషాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : న్యాయమైన కోర్కెల పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్వహించాలని, భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభ దానికి నాంది కావాలని ఎమ్మెల్సీ నెలకంటి సత్యం పిలుపునిచ్చారు. శంషాబాద్‌లో రెండు రోజులుగా జరుగుతున్న భవన నిర్మాణ కార్మికుల రాష్ట్ర సదస్సు మంగళవారం సాయంత్రం ముగిసింది. ఈ ముగింపు సభకు సత్యం ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం జీఎస్టీతో ప్రజల మీద భారాలు మోపుతూ కార్పొరేట్ సంపన్న వర్గాలకు దోచిపెడుతున్నారన్నారు. మతాన్ని, దేవుడిని రాజకీయాల్లోకి తెచ్చి పబ్బం గడుపుకునే ప్రయత్నం బీజేపీ చేస్తుందని దుయ్యబట్టారు. ప్రశ్నించే వారిపై ఈడీ, సీబీఐతో దాడులు చేయించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ఉండటానికి కనీసం ఇళ్లు కూడా లేవన్నారు. ఈ కార్మికులకు ప్రభుత్వం పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఈ మహాసభలో మంచి నిర్ణయాలు తీర్మాణాలు చేసి భవిష్యత్తులో ప్రభుత్వాలపై తిరుగుబాటు చేయాలన్నారు. పోరాటం ద్వారానే కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిఎస్. బాల్‌రాజు, ఎం. నరసింహ, పల్లా దేవేందర్‌రెడ్డి గన్నారు రమేష్, ప్రవీణ్‌కుమార్‌గౌడ్, పానుగంటి పర్వతాలు, రామస్వామి, సామిడి శేఖర్ రెడ్డి, దత్తునాయక్, కే.చందు, ఎస్. మల్లేష్, సత్యనారాయణ, హరిసింగ్, డీ.ప్రసాద్, నర్సాగిరి, అన్నపు ప్రభు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

పౌష్టికాహారంతోనే పిల్లల్లో ఆరోగ్యం

మేడ్చల్‌టౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారం తీసుకుంటేనే పిల్లలు, తల్లులు ఆరోగ్యంగా ఉంటారని అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అన్నారు. మంగళవారం మేడ్చల్‌లో నిర్వహించినన పోషణ పక్వాడా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. అంగన్‌వాడీ టీచర్లనుద్దేశించి మాట్లాడుతూ. ప్రభుత్వం బాలింతలకు, పిల్లలకు అందజేస్తున్న పౌష్టికాహార సక్రమంగా అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ కాంతమ్మ పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు వైద్య శిబిరం

వికారాబాద్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి):వికారాబాద్ నియోజకవర్గం నుంచి హజ్ యాత్రకు వెళ్తున్న యాత్రికులకు వికారాబాద్‌లోని క్లబ్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం వైద్య శిబిరం, సన్మాన కార్యక్రమం, విధు కార్యక్రమాలను హజ్ కమిటీ సభ్యురాలు బేగం కుమారులు ఆసిఫ్, సల్మాన్ నిర్వహించారు. గ్రంథాలయ మాజీ చైర్మన్ హఫీజ్, మజీద్, ఉస్మాన్ 40మంది యాత్రికులకు శుభాకాంక్షలు తెలిపారు. అయూబ్ అన్సారీ, సర్ఫ్రాజ్, వహీద్, అబ్బాస్, రమేష్, షరీఫ్, రామచంద్రారెడ్డి, మురళి, వేణుగోపాల్ తదితర ప్రముఖులు హాజరయ్యారు. యాత్రికులకు వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

రోడ్డుపై పడిన చెట్ల తొలగింపు

బషీరాబాద్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రెండురోజుల కిందట గాలివానకు బషీరాబాద్-తాండూరు రోడ్డుపై చెట్లు విరిగిపడ్డాయి. బషీరాబాద్ ఎస్ఐ పి.శంకర్ మంగళవారం నవాల్గ గేటు సమీపంలో రోడ్డుపై పడిన చెట్లను తొలగించారు. అలాగే ఆటువైపు వెళ్తున్న వాహనదారులు సైతం ఎస్ఐతో కలిసి చెట్లను తొలగించారు.

పార్కు స్థలం రక్షణకు చర్యలు

● కమిషనర్‌కు మున్సిపల్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాండూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): తాండూరులో రూ.అరకోటి విలువైన పార్కు స్థలాన్ని కబ్జాకు చేసిన యత్నంపై ఆరా తీసి జాగ రక్షణకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ అధికారులు కమిషనర్‌ను ఆదేశించారు. 'పార్కు స్థలానికి ఎసరు' శీర్షికన ఈనెల 21న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో ఉన్నతాధికారులు స్పందించారు. స్థలాన్ని సర్వే చేయాలని మంగళవారం మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ విక్రంసింహారెడ్డి, టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ సెక్షన్ చైన్‌మెన్ కొడంగల్ రోడ్డులోని బాలాజీనగర్‌లో కబ్జాకు యత్నించిన స్థలం వద్దకు వెళ్లి సర్వే చేశారు. ప్రభుత్వ స్థలాన్ని కాపాడేందుకు చేపడుతున్న చర్యలు అభినందనీయం అని కాలనీవాసులు, మాజీ కౌన్సిలర్ అన్నారు.

పాత టైర్లు, ట్యూబుల వేలం

వికారాబాద్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పోలీసు వాహనాల పాత టైర్లు, ట్యూబులు, బ్యాటరీలు విడి భాగాల వేలాన్ని నిర్వహిస్తామని వికారాబాద్ ఎస్పీ కె.నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. పోలీసు శాఖ వాహనాలకు వాడేసిన పాత టైర్లు, ట్యూబులు, బ్యాటరీలు, స్క్రాప్ వేలానికి నిర్ణయించామన్నారు. 26న ఉదయం 10గంటలకు పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో వేలం వేస్తామన్నారు. వేలంలో పాల్గొనే వారు జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు హాజరుకావాలన్నారు. ఈ విషయంలో ఏదైనా సమాచారం కొరకు ఆర్ఐ అంజత్ పాషా సెల్ నం: 8712670028లో సంప్రదించాలని తెలిపారు.

బడిబాట కరపత్రం ఆవిష్కరణ



బడిబాట కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న డీఈవో రేణుకాదేవి, ఉపాధ్యాయులు

పూడూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కంకల్‌పాఠశాలలో 2025-26కుగాను బాడిబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మంగళవారం డీఈవో కార్యాలయంలో డీఈవో రేణుకాదేవి బడిబాట కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల నమోదు సంఖ్యను పెంచేలా కృషిచేయాలని సూచించారు. బడిబాట కరపత్రాన్ని ముద్రించడం అభినందనీయమని దాతలు రాజు, సురేందర్‌లను డీఈవో అభినందించారు. టీచర్ ఈశ్వర్‌రావు మాట్లాడుతూ.. బడిబాటలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తామన్నారు. ఏఎంవో రాంమస్తా, తైలం రాజు, బి.సురేందర్, టీచర్లు నాయుడు, ఈశ్వర్, రాజన్ పాల్గొన్నారు.

ఉపాధి పనులను పరిశీలించిన అధికారులు

పెద్దేముల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): తట్టెపల్లిలో ఉపాధిహామీ పనులు, వాటి రికార్డులను మంగళవారం నేషనల్ లెవెల్ మానిటరింగ్(ఎన్ఎల్ఎం)టీం సభ్యులు పరిశీలించారు. పని ప్రదేశానికి వెళ్లి పనులు సక్రమంగా చేశారా? అని చూశారు. రికార్డులను తనిఖీ చేసి కూలీలతో మాట్లాడారు. రికార్డులను ఇంకా బాగా మెయింటెన్ చేయాలని సిబ్బందికి సూచించారు.

అంగన్‌వాడీ సెంటర్‌లో గ్రాడ్యుయేషన్ డే

తాండూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): తాండూరు గాంధీనగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. చిన్నారులను గ్రాడ్యుయేట్స్‌గా తయారు చేశారు. సామాజిక వేత్త, సత్యసాయిట్రస్టు అధ్యక్షుడు జగదీశ్‌సింగ్ మాట్లాడుతూఅంగన్‌వాడీ సెంటర్‌లో గ్రాడ్యుయేషన్ డేను జరుపుకోవడం మంచి విషయమన్నారు. మాజీ కౌన్సిలర్ సంగీతఅజయ్‌సింగ్ విద్యార్థులను ప్రోత్సహిస్తున్న అంగన్‌వాడీ టీచర్‌రాధను అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేశ్వరి, ఏఎన్ఎం శాంత, సుజాత, అనిత పాల్గొన్నారు.

రేపటి నుంచి లక్ష్మీనారసింహుడి బ్రహ్మోత్సవాలు

కీసర, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఈనెల 24వ తేదీ నుంచి 27 వరకు చీర్యాల్‌లక్ష్మీ నరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ మంగళవారం తెలిపారు. సీఐ శ్రీనివాస్ ఏర్పాట్లను పరిశీలించారు. వేసవి సెలవుల దృష్ట్యా భారీగా భక్తులు వస్తారని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అదే భక్తులకు మజ్జిగ, మంచి నీరు, అన్నవితరణ కార్యక్రమాలు చేపడుతున్నట్టు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ మల్లారపు, సీఐ తెలిపారు.

25, 26 తేదీల్లో విశ్వవిశ్వానిలో జాతీయ సదస్సు

శామీర్‌పేట, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి):శామీర్‌పేట మండలం తూంకుంటలోని విశ్వవిశ్వాని కాలేజీలో ఈనెల 25, 26 తేదీల్లో జాతీయ సదస్సును నిర్వహిస్తామని కాలేజీ డైరెక్టర్ రామకృష్ణ మంగళవారం తెలిపారు. ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ ఐఈడీఎస్ రిటైర్డ్ అసిసెంట్ డైరెక్టర్ సుధీర్‌కుమార్, ఐసీఎస్ఎస్ఆర్-ఎస్ఆర్సీ డైరెక్టర్, ఓయూఎకనామిక్స్ ప్రొఫెసర్ సుధాకర్‌రెడ్డి వస్తారని తెలిపారు. 'అభివృద్ధి-సవాళ్లు, అవకాశాలు' అంశంపై సదస్సును నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

22కెడియల్20: వార్షికోత్సవంలో మాట్లాడుతున్న రాజేశ్‌రెడ్డి

ఘనంగా పాఠశాలల వార్షికోత్సవం

కొడంగల్/దుద్యాల, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కొడంగల్‌లోని నవీన ఆదర్శ పాఠశాలలో మంగళవారం 38వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. మాజీ ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నందారం ప్రశాంత్, మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి హాజరై మాట్లాడారు. శీలాదేవి, రాములు, శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్, కవి, రచయిత వెంకటయ్య, అఖిల్, డి.వెంకటయ్య, ప్రిన్సిపాల్ డివి.నరేశ్‌రాజ్, పాల్గొన్నారు. చిలుముల్‌మైలారం పాఠశాలలో వార్షికోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు విజయరామారావు, రాంరెడ్డి, హరిలాల్, వేణుగోపాల్, వెంకటయ్య, నర్సిరెడ్డి, టీచర్లు వెంకటయ్య రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.



ధరిత్రి దినోత్సవం

నాగారం మునిసిపాలిటీ పరిధి రాంపల్లి దాయరలోగల జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం ధరిత్రి దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఉపాధ్యాయులు బాలలకుసూచించారు.

- కీసర, ఏప్రిల్22 (ఆంధ్రజ్యోతి)

బడిలో కిచెన్ గార్డెన్

● తాజా కూరగాయలతో విద్యార్థులకు వంటకాలు


పాలకూరను కోస్తున్న ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు

బషీరాబాద్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ప్రకృతి సిద్ధంగా ఎటువంటి రసాయన ఎరువులు వాడకుండా కిచెన్ గార్డెన్ పెంపకంతో కల్తీ లేని స్వచ్ఛమైన కూరగాయలు పండిస్తూ విద్యార్థులకు వండి పెడుతోంది బషీరాబాద్ జెడ్పీ ఉన్నత పాఠశాల(బాలికలు) ఉపాధ్యాయుల బృందం. ఇందుకు జీహెచ్ఎం హీర్యానాయక్ ప్రత్యేక చొరవ తీసుకుని ఉపాధ్యాయ బృందంతో కలిసి పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయించాడు. ఇందుకు అవసరమైన మట్టిని తెప్పించి, పశువుల ఎరువును కలిపి కూరగాయల విత్తనాలు నాటించారు. వంకాయ, పాలకూర, మెంతికూర, టమాట, కొత్తిమీర వంటివి సాగు చేస్తూ ఈ తోటను నిత్యం పర్యవేక్షిస్తున్నారు. ప్రతి రోజు ఇక్కడా తాజాగా పండిన ఎదో ఒక కూరగాయను ఉపాధ్యాయులు స్వయంగా కోసి విద్యార్థులకు వండి వడ్డిస్తున్నారు. పాఠ్యాంశాలే కాకుండా కిచెన్ గార్డెన్‌లోకి విద్యార్థులను తీసుకెళ్లి స్వయంగా సాగు తీరును చూపిస్తూ ఇక్కడి ఉపాధ్యాయులు పలువురికి ఆదర్శంగా నిలిస్తున్నారు.

సమ్మర్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలి

● బీసీ గురుకుల కళాశాలల కార్యదర్శి అలుగు వర్షిణి


విద్యార్థులతో మాట్లాడుతున్న వర్షిణి

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సమ్మర్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల కార్యదర్శి అలుగు వర్షిణి తెలిపారు. ఘట్‌కేసర్ పరిధి ఎదులాబాద్‌లోని ఉప్పల్ ఫైన్ ఆర్ట్స్ గురుకుల పాఠశాలలో మంగళవారం ఆమె సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ క్యాంప్ మే 6వరకు కొనసాగుతుందన్నారు. చేరియల్ పెయింటింగ్, మట్టితో కుండలు తయారీ, కార్టూన్స్ పెయింటింగ్, క్యారికేచర్స్ జర్నలిజం, చేతిరాత నైపుణ్యాలు, నేచర్ థండర్స్ ఫొటోగ్రఫీ, డ్రాయింగ్, జంబారా ఎంబ్రాయిడరి తదితర అంశాల్లో శిక్షణ ఇస్తామన్నారు. బాలబాలికలకు వసతి, భోజనం అందిస్తామన్నారు. 1,200 మంది విద్యార్థులు క్యాంప్‌లో పాల్గొనేందుకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో గురుకుల కళాశాలల అదనపు కార్యదర్శి సత్రునాయక్, జోనల్ ఆఫీసర్ నిర్మల, రజిని, డీసీవో వేణుగోపాల్, ప్రిన్సిపాళ్లు రాము, వెంకటేశ్ టీచర్లు పాల్గొన్నారు.

బడుగువర్గాల సంక్షేమమే లక్ష్యం

● షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


కొందుర్గు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

చౌదరిగూడ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం కొందుర్గులో జైభీమ్, జైబాపు, జైసంవిధాన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మండల కేంద్రంలోని చౌరస్తాలో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమిత్ షా పార్లమెంట్ సాక్షిగా అంబేడ్కర్‌ను అవమానించారని గుర్తుచేశారు. అంతకు ముందు శ్రీరంగాపూర్ వద్ద షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ సభ్యుడు సయ్యద్ సాధిక్ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించి ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ దామోదర్ రెడ్డి, షాద్‌నగర్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు రజిత, వజ్రమ్మ, పురుషోత్తం రెడ్డి, నరేందర్, గోవర్ధన్‌గౌడ్, మల్లేష్ గౌడ్, జీబీ కృష్ణ, పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలి


మాట్లాడుతున్న రామ్మోహన్‌రావు

ఆమనగల్లు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి కార్మికులు సంఘటితంగా ముందుకు సాగాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రామ్మోహన్ రావు, తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గ్యార పాండులు పిలుపునిచ్చారు. మేడేను పండుగలా జరుపుకోవాలని అన్నారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం సీఐటీయూ సమావేశం నిర్వహించారు. ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి రామ్మోహన్ రావు, పాండులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మేడే ఉత్సవాల నిర్వాహణ, మే 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మె విజయవంతం, కార్మికుల సమస్యల పరిష్కారం తదితర విషయాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్లను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. భవన నిర్మాణ సంఘం మండలాధ్యక్షుడు యాదయ్య, కార్యదర్శి సురేందర్, చంద్రమౌళి, పాండు, పర్వతాలు, లక్ష్మణ్, కవిత, హంసమ్మ, యాదమ్మ, గోజి, పద్మ పాల్గొన్నారు.

కర్ణాటక తరహా మైన్స్ పాలసీని అమలుచేయండి


వేం నరేందర్‌రెడ్డితో చర్చిస్తున్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, స్టోన్ క్రషింగ్ కంపెనీల ప్రతినిధులు

తాండూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): నాపరాతి , అనుమతులు, లీజుల విషయంలో మన రాష్ట్రంలోనూ కర్ణాటక తరహా పాలసీని అమలు చేయాలని ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్‌రెడ్డిని తాండూరు స్టోన్‌క్రషింగ్ కంపెనీల ప్రతినిధులు కోరారు. మంగళవారం రాత్రి మనోహర్‌రెడ్డితో కలిసి వ్యాపారులు రవూఫ్, ఓంప్రకాశ్, సోమాని, అన్వర్, జుబెర్ పాషా, లాలా.. వేంనరేందర్‌రెడ్డికి తమ సమస్యలపై విన్నవించుకున్నారు. ప్రభుత్వం రాయితీలిస్తేనే పరిశ్రమ మనుగడ ఉంటుందని, పేదలకు ఉపాధి దొరుకుతుందని తెలిపారు. ఈ విషయంలో ముఖ్యమంత్రితో మాట్లాడి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయిస్తానని వేం నరేందర్‌రెడ్డి హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు.

ఇంటర్‌లో స్టేట్ టాపర్లు

రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన జిల్లా విద్యార్థులు


నందిని పల్లవి మధుశ్రీ సరిత శృతిలయ కిరణ్‌గౌడ్

ఆమనగల్లు/శంకర్‌పల్లి/చేవెళ్ల/మంచాల, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మేడిగడ్డ తండాకు చెందిన ఇస్లావత్ పల్లవి ఇంటర్మీడియట్ ద్వితీయసంవత్సరం ఫలితాల్లో సత్తా చాటింది. బైపీసీ లో 995/1000 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించింది. మేడిగడ్డ తండాకు చెందిన ఇస్లావత్ జాను నాయక్, పుష్ప దంపతుల కూతురు ఇస్లావత్ పల్లవి హైదరాబాద్ బీఎన్‌రెడ్డి నగర్‌లోని శ్రీ కృష్ణవేణి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదివింది. మంగళవారం విడుదల చేసిన ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ర్యాంకు సాధించింది. ఆమె తండ్రి ఇస్లావత్ జానునాయక్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అలాగే ఆమనగల్లుకు చెందిన బోడ మధుశ్రీ ఇంటర్ సెకండియర్ ఎంపీసీలో 1000కి గాను 994 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంక్ సాధించింది. ఆమనగల్లు పట్టణానికి చెందిన పల్లె సరితకు ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూప్‌లో 467/470 మార్కులతో రాష్ట్ర స్థాయిలో రెండో స్థానం, శంకర్‌పల్లిలోని శ్రీవివేకానంద జూనియర్ కళాశాలకు చెందిన నందిని ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో (992/1000) మార్కులు సాధించి ఐదో ర్యాంకు సాధించింది. వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం మైతాబ్‌ఖాన్‌గూడ గ్రామానికి చెందిన నందినిని కళాశాల కరస్పాండెంట్ హన్మంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్‌లు ఆమెను అభినందించారు. చేవెళ్ల తెలంగాణ మోడల్ కళాశాలలో ఎంపీసీ మొదటి సంత్సరం చదువుతున్న ఇ. శృతిలయ 470 మార్కులకు గాను 468 మార్కులు సాధించి మొదటి స్థానం, శ్రీచైతన్య కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థి కిరణ్‌గౌడ్ ఎంపీసీలో 470 మార్కులకు గాను బి. కిరణ్‌గౌడ్ 467 మార్కులు సాధించి రెండవ ర్యాంకు, మంచాల మండలం జాపాల గ్రామానికి చెందిన బకునసంజన ఇంటర్‌లో 994 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు పొంది శభాష్ అనిపించుకుంది.


సంజనకు మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు

ఫ్రాడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో అశోక్‌కు చోటు



దౌల్తాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ నియోజకవర్గంలోని దౌల్తాబాద్ మండలంలోని యాంకి గ్రామానికి చెందిన చిత్రకారుడు డాక్టర్ సున్నపు అశోక్ మరోమారు ఇండియా ఫ్రాడ్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కించుకున్నాడు. చిత్రకళ, సూక్ష్మ చిత్రకళలో ఆయన దిట్ట. కళారంగంలో రాణిస్తున్న ఆయన కృషికి గతంలో జాతీయ, అంతర్జాతీయ అవార్డులు, రివార్డులు అందుకున్నాడు. ఫరీదాబాద్, హర్యానాకు చెందిన ఇండియా ఫ్రాడ్ బుక్ ఆఫ్ రికార్డ్ సంస్థ సీఈవో కపిల్ సాహ్ అశోక్ కళా నైపుణ్యాన్ని పరిశీలించి రికార్డుగా ధ్రువీకరించి సర్టిఫికెట్‌ను ఆన్‌లైన్‌లో అందించినట్లు అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా అశోక్‌ను గ్రామస్తు, తోటి స్నేహితులు అభినందించారు.

ఇంద్రారెడ్డి ఆశయాలను కొనసాగిస్తాం

● మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి


చేవెళ్ల : కౌకుంట్లలోని ఇంద్రారెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న సబితారెడ్డి తదితరులు

చేవెళ్ల/శంషాబాద్‌రూరల్/మంచాల/శంకర్‌పల్లి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఇంద్రారెడ్డి ఆశయాలను కొనసాగిస్తామని, పట్లోళ్ల కుటుంబానికి రాజకీయ జీవితం ఇచ్చిన చేవెళ్ల ప్రాంత ప్రజలకు తుదిశ్వాస వరకు సేవ చేస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. దివంగత మాజీ హోంమంత్రి ఇంద్రారెడ్డి 25వ వర్ధంతి సందర్భంగా మంగళవారం చేవెళ్ల మండల పరిధిలోని కౌకుంట్లలో ఇంద్రారెడ్డి సమాధిపై పూలమాలలతో కుటుంబ సభ్యులు కార్తీక్ రెడ్డి, కౌశిక్‌రెడ్డి, కళ్యాణ్‌రెడ్డి, కోడళ్లు, ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్యేలు పట్నం నరేందర్‌రెడ్డి, డాక్టర్ ఆనంద్, పలువురు నాయకులతో కలిసి సబితారెడ్డి నివాళులర్పించారు. అక్కడికి వచ్చినవారికి అన్నదానం చేశారు. అంతకుముందు చేవెళ్ల మండల కేంద్రంలోని ఇంద్రారెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. డీసీఎంఎస్ మాజీ చైర్మెన్ కృష్ణారెడ్డి, రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, చేవెళ్ల నియోజకవర్గం మాజీ ఇన్‌చార్జి ఆంజనేయులు, చేవెళ్ల మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, మండలాధ్యక్షుడు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి హన్మంత్‌రెడ్డి, శివప్రసాద్, బి.నర్సింలు, గిరిధర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, కృష్ణ, ప్రభాకర్ రెడ్డి, చేవెళ్ల, మహేశ్వరం, వికారాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్, శంషాబాద్, తాండూర్ తదితర మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ శంషాబాద్ మండలాధ్యక్షుడు మోహన్‌రావు ఆధ్వర్యంలో పాల్మాకులలో ఇంద్రారెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. కాంగ్రెస్ రాష్ట్ర నేత కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా నేత ముచ్చర్ల వెంకటేష్‌యాదవ్‌లు మంచాల మండలం ఆరుట్లలోని ఇంద్రారెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, జయమ్మ, ఎల్లేష్, బాషయ్య, తదితరులున్నారు. శంకర్‌పల్లిలోని ఇంద్రారెడ్డి విగ్రహానికి కళ్యాణ్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు నివాళులర్పించారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, నారాయణ, మాణిక్‌రెడ్డి, పాపారావు, రాజునాయక్. పాల్గొన్నారు.

షాద్‌నగర్ శాఖ ఎలక్ట్రానిక్ మీడియా కార్యవర్గం

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ఎలక్ట్రానిక్ మీడియా షాద్‌నగర్‌శాఖ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హోటల్ ఎన్‌హెచ్-44లో జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా నర్సింహా, ఉపాధ్యక్షుడిగా సలీం, శ్రీనివాస్, శివ, ప్రధాన కార్యదర్శిగా ఫయాజ్, సంయుక్త కార్యదర్శులుగా విష్ణు, రాజు, సాబేర్, కోశాధికారిగా రజాక్‌లు ఎన్నికైనారు. నూతన కార్యవర్గ సభ్యులను టీయూడబ్ల్యూజే నాయకులు గుడుపల్లి శ్రీనివాస్, చెక్కల శ్రీశైలం, రాఘవేందర్‌లు సన్మానించి అభినందించారు.

బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన లక్ష్మీనారాయణ స్వామి ఆలయం



తలకొండపల్లి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధి గాంచిన తలకొండపల్లి మండలం వెంకటాపురం శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఈనెల 23 నుంచి 25వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయి. దశాబ్దాల చరిత్ర కలిగిన ఆలయంలో సత్యనారాయణ స్వామితో పాటు శివలింగం, ఆంజనేయ స్వామి, ఎల్లమ్మదేవతలు కొలువై ఉన్నారు. ఆలయంలో నిత్యపూజలు, కొనసాగుతాయి. బ్రహ్మోత్సవాల వివరాలను ఆలయ చైర్మన్ తిరుమణి శేఖర్‌గౌడ్, వైస్ చైర్మన్ అంజన్ రెడ్డిలు వివరించారు. విజయవంతం చేయాలని మాజీ సర్పంచ్ రమేశ్ యాదవ్, మాజీ ఎంపీటీసీ సునితసుదర్శన్‌రెడ్డి, అర్చకులు కామేశ్వరమూర్తిలు కోరారు.

నవ దంపతులకు చీఫ్‌విప్ ఆశీర్వాదం

తాండూరు రూరల్, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): సిరిగిరిపేట్‌కు చెందిన తింసాన్‌పల్లి నిర్మల, పప్పి దంపతుల కుమారుడు అరవింద్-శివలీల వివాహం ఈ నెల 20వ తేదీన జరిగింది. కుటుంబీలు ఆహ్వానం మేరకు ప్రభుత్వ చీఫ్‌ విప్ మహేందర్‌రెడ్డి సోమవారం రాత్రి వారింటికి వెళ్లి నవ దంపతులను ఆశీర్వదించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ అంబ్రేష్, నాయకులు నర్సింహులు, శివప్ప, బాలు, రాజు, పురుషోత్తంరావు తదితరులు ఉన్నారు.

పోషకాహారంపై అవగాహన కల్పించాలి


పోషకాహార పదార్థాలను పరిశీలిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పోషణలోపం ఉన్న పిల్లలను గుర్తించి వారికి మంచి ఆహారాన్ని అందించేలా తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలని అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో ఏప్రిల్ 8 నుంచి 22వరకు నిర్వహించిన పోషణపక్షం ముగింపు ఉత్సవాల్లో చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి స్పీకర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. పోషణ పక్షంలో భాగంగా మొదటి వంద రోజుల పిల్లల ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలిపారు. పిల్లల్లో ఊబకాయాన్ని తగ్గించేలా జీవనశైలిలో మార్పులు తేవాలన్నారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పోషకాహార పదార్థాలపై అవగాహన కల్పించే ఈ కార్యక్రమం ఎంతో తోడ్పడుతుందన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు పోషకాహార పదార్థాలను స్టాళ్లలో ప్రదర్శించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, మనోహర్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఇన్‌చార్జి డీడబ్ల్యూవో జయసుధ, సీడీపీవోలు రజిత, వెంకటేశ్వరమ్మ, కాంతారావు, మెహరున్నీసాబేగం, ప్రవీణ, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

లగచర్ల రైతులకు పరిహారం అందజేత


రైతుకు చెక్కును అందజేస్తున్న సబ్ కలెక్టర్

తాండూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల రైతులకు మంగళవారం తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ రూ.2.49కోట్ల పరిహార చెక్కులను పంపిణీ చేశారు. మల్టీపర్పస్, ఇండస్ట్రియల్ పార్కుకు భూములు కోల్పోయిన 10మంది రైతులకు పరిహారం కింద ఈ చెక్కులను అందజేశారు. వీరందరిదీ కలిసి 12ఎకరాల 19గుంటల భూమి పోయింది. రైతులు పరిహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సబ్ కలెక్టర్ సూచించారు.

సీఎంపై అసత్య ప్రచారం.. వ్యక్తి అరెస్టు

● స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు.. మరొకరిపై కేసు నమోదు

ఆమనగల్లు/ ధారూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అసత్య ప్రచారం చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలానికి చెందిన జంబుల పాండురంగారెడ్డిని కడ్తాల్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కడ్తాల్ సీఐ గంగాధర్ తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రానికి చెందిన జంబుల పాండురంగారెడ్డి అలియాస్ రంగయ్య అనే వ్యక్తి తన ఫేస్‌బుక్‌లో ఉన్న జైశ్రీరామ్ గ్రూపులో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటంపై 'రెస్ట్ ఇన్ పీస్' అని ఉండటం చూసి తన ఫేస్‌బుక్‌లో దానికి చుక్కల్లోకి ఎక్కినాడు చక్కనోడు అనే పాటను కలిపి అప్‌లోడ్ చేశాడు. ఫేస్‌బుక్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటంపై ఆర్ఐపీ అనే అక్షరాలను ఉంచి సోషల్ మీడియాలో పెట్టడంతో పాటు దుష్ప్రచారం చేయడం, రాజకీయ పార్టీల మధ్య విభేదాలు సృష్టించేలా వ్యవహరించాడని సీఐ తెలిపారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పాండురంగారెడ్డిని మంగళవారం కోర్టులో హాజరుపర్చినట్లు చెప్పారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేసినా, అవగాహన లేకుండా ఇతరుల నుంచి వచ్చే వాటిని అప్‌లోడ్ చేసినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. కాగా శాసన సభ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఓ వ్యక్తిపై మంగళవారం ధారూరు పోలీసులు కేసు నమోదు చేశారు. వికారాబాద్ జిల్లా ధారూరు మండల పరిధిలోని చింతకుంట గ్రామానికి చెందిన ఎల్.శ్రీనివాస్ అనే వ్యక్తి ఫోన్‌లో ప్రసాద్‌కుమార్‌ను తీవ్రంగా దూషిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేశాడు. ఆ రికార్డును చింతకుంట గ్రామ కాంగ్రెస్ వాట్సాప్ గ్రూపులో పోస్టు చేశాడు. అది వైరల్ కావడంతో అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాణిక్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. ఎల్.శ్రీనివాస్ స్పీకర్‌ను దూషించి వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేసినట్లు నిర్ధారించినట్లు ఎస్ఐ అనిత తెలిపారు.


గండిపేట చెరువు వద్ద చెత్తాచెదారం

చెరువు చెంతనే.. చెత్తాచెదారం

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్22 (ఆంధ్రజ్యోతి): నగరవాసులకు తాగునీటి అవసరాలు తీరుస్తున్న జంటజలాశయాల్లో ఒకటైన గండిపేట చెరువు పక్కనే డంపింగ్ యార్డును తలపించేలా చెత్తాచెదారం పడేస్తున్నారు. దీంతో చెరువు కలుషితమవుతోంది. మండలంలోని హిమాయత్‌నగర్ సమీపంలోని గండిపేట చెరువు వద్ద కొందరు నిత్యం చెత్త వేస్తున్నారు. దాంతో అక్కడికి వచ్చేవారు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. ఇక మున్సిపల్ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. చెరువు పరిసరాల్లో చెత్త వేయకుండా బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కాంగ్రెస్‌కు బిగ్‌షాక్

● బీఆర్ఎస్‌లో మళ్లీ చేరిన గిరిజన నేత లచ్చానాయక్


మహేశ్వరం : సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న లచ్చానాయక్

కందుకూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. ఇటీవల బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరిన గిరిజన సంక్షేమ సంఘం మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు ఎస్. లచ్చానాయక్ మంగళవారం మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి సమక్షంలో తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు. మండలంలోని పులిమామిడి, పెద్దమ్మతండా, దావుత్‌గూడ తండాలలో లచ్చానాయక్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ చంద్రశేఖర్, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు జయేందర్‌ముదిరాజ్‌లతో కలిసి నగరంలోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లిన ఆయనకు సబితారెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. లచ్చానాయక్ మాట్లాడుతూ పెద్దమ్మతండాకు చెందిన మాజీ ఉపసర్పంచ్ రేఖ్యానాయక్, లక్ష్మణ్‌నాయక్, విజయ్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్‌లతో కలిసి సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరినట్లు ఆయన తెలిపారు. ఎస్. రాజశేఖర్‌రెడ్డి, మేఘనాథ్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రాజునాయక్ పాల్గొన్నారు.

సూర్యప్రతాపం!

(5వ పేజీ తరువాయి)



మోమిన్‌పేట, మర్పల్లి, కోట్‌పల్లి, బంట్వారం మండలాల్లో 42డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మేడ్చల్ జిల్లాలో సోమవారం 42.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఏప్రిల్‌లోనే భానుడు భగభగమండుతుండడంతో మే నెలలో ఏంటి పరిస్థితని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది మార్చి మొదటి వారం నుంచి ఎండలు తీవ్రత అధికంగా ఉన్న విషయం తెలిసిందే. అయితే గత వారం పాటు వాతావరణం చల్లబడి కొన్ని చోట్ల కూడా వర్షాలు కూడా పడ్డాయి. మళ్లీ ఇప్పుడు ఒక్కసారిగా ఎండల తీవ్రత మరింత పెరిగింది. పగలు ఎండలు ఠారెత్తించడంతో పాటు ఉక్కబోత పెరగడంతో జనం అల్లాడుతున్నారు. అయితే సాయంత్రం వేళల్లో నగర శివార్లలో వాతావరణం కాస్తా చల్లబడుతుండడం కొంత ఊరట కలిగిస్తోంది. ఇదిలా ఉంటే రానున్న మూడు రోజుల్లో ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. ఈ మూడు రోజులు పాటు కొన్ని చోట్ల రెండు నుంచి మూడు డిగ్రీల ఈ మేర ఉష్ణోగ్రతలు పెరగవచ్చని అంచనా వేస్తూ అరెంజ్ ఎలర్ట్ జారీ చేసింది.

వికారాబాద్‌లో ఉక్కిరిబిక్కిరి

వికారాబాద్ జిల్లాలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయమే ఎండలు ఉగ్రరూపం దాలుస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి తొమ్మిది గంటలవుతున్నా వేడి తగ్గకపోవడంతో ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. ప్రచండభానుడు ఉగ్రరూపం దాలుస్తుండడంతో వికారాబాద్ జిల్లాలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఏప్రిల్ నెల ప్రారంభంలోనే 40 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదవగా, మంగళవారం ఏకంగా 42.7 డిగ్రీలకు చేరింది. జిల్లాలో 24 ప్రాంతాల్లో నమోదైన ఉష్ణోగ్రతల్లో 17 చోట్ల 40 డిగ్రీలకు పైగానే నమోదు కావడం గమనార్హం. ఈ సీజన్‌లో తొలిసారిగా మంగళవారం జిల్లాలో తొరమామిడి(నాగారం), దుద్యాలలో 42.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కొడంగల్‌లో 42.6, మోమిన్‌పేట్‌లో 42.5, మర్పల్లిలో 42.4, కోట్‌పల్లిలో 42.2 , బంట్వారంలో 42.0 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ధారూరులో 41.5, తాండూరు ఏఆర్ఎస్ స్టేషన్‌లో 41.5, దోమలో 41.4, నవాబ్‌పేట్‌లో 41.4, తాండూరులో 41.2, యాలాల్‌లో 41.2, దౌల్తాబాద్‌లో 41.2, దావలాపూర్‌లో 41.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మదన్‌పల్లిలో 41.1, బషీరాబాద్‌లో 40.6, కాశింపూర్‌లో 40.5, వికారాబాద్‌లో 40.4, పెద్ద ఉమ్మెంతాల్‌లో 40.4, మన్నేగూడలో 40.3, పెద్దేముల్‌లో 40.2, పరిగిలో 40.1, మద్గుల్ చిట్టంపల్లిలో 40.1 డిగ్రీలు నమోదయ్యాయి. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. జిల్లాలో నమోదవుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు ప్రజలను ఓ వైపు ఠారెత్తిస్తుంటే.. రాత్రి వేళ ఉష్ణోగ్రతలు కూడా క్రమంగా పెరుగుతున్నాయి. జిల్లాలో మోమిన్‌పేట్‌లో 35.2 డిగ్రీలు కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కావడం గమనార్హం.

వరంగల్ సభను విజయవంతం చేద్దాం


కడ్తాల్ : మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

కడ్తాల, ఏపిల్ 22(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు బీఆర్ఎస్ శ్రేణులు దండులా కదలాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ పిలుపునిచ్చారు. కడ్తాల మండల కేంద్రంలో మంగళవారం బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కంబాల పరమేశ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కల్వకుర్తి నియోజకవర్గం నుంచి సభకు పెద్దఎత్తున జనసమీకరణ చేస్తున్నట్లు జైపాల్ యాదవ్ చెప్పారు. డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, ఆనంద్, కడారి రామకృష్ణ, చంద్రమౌళి, శ్రీను, మహేశ్ పాల్గొన్నారు.

చేవెళ్ల: బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలిరావాలని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఉమ్మడి జిల్లా డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, మండలాధ్యక్షుడు ప్రభాకర్, మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, సీనియర్ నాయ

క్రైం కార్నర్

బైకులను ఢీకొట్టిన కారు

● ఇద్దరికి గాయాలు.. ఆస్పత్రికి తరలింపు

చౌదరిగూడ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కారు డ్రైవర్ అతివేగం, అజాగ్రత్త కారణంగా రెండు బైకులను ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలైన ఘటన కొందుర్గు మండలం రాంచంద్రాపూర్ వద్ద మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. కొందుర్గు మండలం పర్వతాపూర్‌కు చెందిన దర్గ వెంకటేష్, షఫీలు వేర్వేరుగా తమ బైక్‌లపై షాద్‌నగర్ వైపు వెళ్తుండగా.. ఎదురుగా వస్తున్న కారు రెండు బైక్‌లను ఢీకొంది. దాంతో వెంకటేష్ ఎడమ కాలుకు గాయాలు కాగా.. షఫీ తలకు తీవ్రగాయాలయ్యాయి. కారు డ్రైవర్ పారిపోతుండగా కొంతమంది యువకులు వెంబడించి కొందుర్గు శివారులో కారును ఆపారు. వివరాలు సేకరించగా పరిగి మండలం రావులపల్లికి చెందిన బోట్లపల్లి నరేందర్ మద్యం మత్తులో ఉన్నాడని గుర్తించి కొందుర్గు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. పర్వతాపూర్ గ్రామస్థుడు బైక్ మెకానిక్ మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవిందర్‌నాయక్ తెలిపారు. కాగా, వెంకటేష్‌ను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ డీకే అరుణ

కేశంపేట, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఆరెకటికల కుల దేవత ఈర నాగమ్మ కల్యాణ మహోత్సవ వాల్ పోస్టర్‌ను ఎంపీ డీకే అరుణ ఆవిష్కరించారు. మండల కేంద్రంలో వచ్చే నెల 15,16వ తేదీల్లో ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈమేరకు ఆరెకటిక సంఘం సభ్యులు మంగళవారం ఎంపీని హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కలిశారు. కల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికను ఇచ్చి ఈర నాగమ్మ కల్యాణాన్ని హాజరుకావాలని కోరారు. బీజేపీ మాజీ మండలాధ్యక్షుడు రొల్లు రఘురాములుగౌడ్, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి ముల్గాంకర్ శివాజీ, ఆరెకటిక సంఘం సభ్యులు నాగేశ్వర్, నరేష్, మల్లేష్, నర్సింగ్, మధుసూదన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

షాబాద్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో నేడు(బుధవారం) అంతరాయం ఏర్పడుతుందని ఏఈ కోటేశ్వర్‌రావు ప్రకటనలో తెలిపారు. షాబాద్ మండల పరిధిలోని 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఎర్రోనిగూడ, మల్లారెడ్డిగూడ, గోపిగడ్డ, పోలారం, అంతిరెడ్డిగూడ, మాచన్‌పల్లి, కుమ్మరిగూడ, రుద్రారం గ్రామాల్లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఫీడర్లకు దగ్గరగా ఉన్న చెట్ల తొలగింపు కారణంగా అంతరాయం ఏర్పడుతుందని ఆయన చెప్పారు.

అభివృద్ధిలో పర్వేద భేష్ : ఎంపీడీవో



నర్సరీని పరిశీలించిన అనంతరం అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించిన ఎంపీడీవో వెంకయ్యగౌడ్

శంకర్‌పల్లి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో పర్వేద గ్రామం భేష్ అని ఎంపీడీవో వెంకయ్యగౌడ్ అన్నారు. అంగన్‌వాడీ విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. మండల పరిధిలోని పర్వేద అంగన్‌వాడీ సెంటర్, నర్సరీ, పల్లెప్రకృతి వనాలను ఆయన మంగళవారం కార్యదర్శి వసంతతో కలిసి పరిశీలించారు. అంగన్‌వాడీ విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించడంతో పాటుగా, చక్కటి విద్యనందించాలని సూచించారు. నర్సరీ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మొక్కలను సంరక్షించే విధానం పట్ల కార్యదర్శి వసంతను అభినందించారు. పల్లెప్రకృతి వనంలోని చెత్తాచెదారాన్ని దగ్గరుండి శుభ్రం చేయించారు. పర్వేద గ్రామం అభివృద్ధిలో ఎంతో ముందంజలో ఉందని కితాబిచ్చారు. సీసీరోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు గ్రామంలో పూర్తయ్యాయని వివరించారు. చిత్తశుద్ధితో పని చేస్తే ఫలితాలు మెరుగ్గా ఉంటాయని అన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

మల్కాపూర్ అభివృద్ధికి నిరంతర కృషి



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ శివారెడ్డి

చేవెళ్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మల్కాపూర్ గ్రామాభివృద్దే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మల్కాపూర్ మాజీ సర్పంచ్ శేరి శివారెడ్డి తెలిపారు. మంగళవారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని మల్కాపూర్‌లో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.5లక్షలతో గ్రామంలోని ఎస్సీ కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను గ్రామస్థులతో కలిసి శివారెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధిలో మల్కాపూర్ గ్రామాన్ని మండలంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఎమ్మెల్యే యాదయ్య సహకారంతో గ్రామానికి మరిన్ని నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తామని చెప్పారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మాజీ ఉప సర్పంచ్ జాఫర్, నాయకులు దేవుని పురుషోత్తం, ఇక్రమోద్దీన్ గండు ప్రవీణ్, అశోక్, నగేశ్, మల్లేశ్, అర్జున్, వెంకటేష్, శ్రీకాంత్, రాములు, అస్లాం, రవికుమార్, మాజర్, షరీఫ్, ఎల్లయ్య, శివ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట

కడ్తాల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పీఏసీఎస్ డైరెక్టర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డాక్టర్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఎల్.విఠలయ్యగౌడ్‌లు అన్నారు. కడ్తాల మండలం రావిచెడ్ గ్రామానికి చెందిన జంగయ్యకు రూ.60 వేలు, అర్జున్‌కు రూ.42వేలు, సత్తయ్యగౌడ్‌కు రూ.26 వేలు, మహేశ్వరికి రూ.44వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. మంగళవారం రావిచెడ్ గ్రామంలో బాధితులకు శ్రీనివాస్, విఠలయ్యగౌడ్‌లు చెక్కులను అందజేశారు. నాయకులు జనార్దన్‌గౌడ్, రమేశ్‌గౌడ్, రవికుమార్, పారేశ; యాదయ్య, వెంకటేశ్, పవన్‌కుమార్, రాంరెడ్డి, బాస్కర్‌నాయక్, శ్రీశైలం, మల్లయ్య, సంతోష్, రాములు, యాదయ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆదిబట్ల, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని టీసీఎస్ ఎదురుగా ఉన్న శ్రీమిత్ర కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని మంగళవారం కమిషనర్ బాలకృష్ణకు కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. కాలనీ అసోసియేషన్ ప్రతినిధి కృష్ణారావు మాట్లాడుతూ టీసీఎస్ ఇక్కడే ఉండడంతో జనాభా పెరిగే అవకాశం ఉందని, శ్రీమిత్ర కాలనీలో సరైన వసతులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. గ్రేడ్-3 హోదా నుంచి గ్రేడ్-2గా పదోన్నతి పొందిన కమిషనర్‌ను సభ్యులు సన్మానించారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

● అభినందించిన గురువులు, తల్లిదండ్రులు



యెన్నెద్ల కీర్తి, బైపీసీ(433/440) శ్రీచైతన్య జూనియర్ కళాశాల, అమీన్‌పూర్



ఎ.మమత, ఎంపీసీ (467/470) సాంఘిక సంక్షేమ కళాశాల, ఇబ్రహీంపట్నం



నందిని, ఎంపీసీ (992/1000) శ్రీవివేకానంద జూనియర్ కళాశాల, శంకర్‌పల్లి



శృతిలయ, ఎంపీసీ (468/470) తెలంగాణ మోడల్ కళాశాల, చేవెళ్ల



కె. మానస, ఎంపీహెచ్ డబ్ల్యూ (493/500) షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల



పూజ, బైపీసీ (992/1000) సాంఘిక సంక్షేమ కళాశాల, ఇబ్రహీంపట్నం

ఆమనగల్లు/తలకొండపల్లి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈమేరకు ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెకండియర్‌లో 115 విద్యార్థులకుగాను 76మంది, ఫస్టియర్‌లో 133 మంది విద్యార్థులకు 47ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ మాధవరావు తెలిపారు. సెకండియర్ 66శాతం, ఫస్టియర్‌లో 35.33 శాతం ఉత్తీర్ణులైనట్లు ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా తలకొండపల్లి మండలం చంద్రధన గ్రామానికి చెందిన యెన్నెద్ల కీర్తి ఇంటర్ ఫస్టియర్ బైపీసీలో 440కి గా ను 433 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచింది.

ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో ఇంటర్ ఫైనలియర్‌లో 81.81 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్‌లో 73 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ వరూధిని తెలిపారు. సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్ ఫైనలియర్‌లో 98.7 ఉత్తీర్ణతా శాతం ఉన్నట్లు ప్రిన్సిపాల్ ఎం.లీలావతి తెలిపారు. ఇబ్రహీంపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫైనలియర్(జనరల్)లో ఉత్తీర్ణతా శాతం 40.2. ఒకేషనల్ ఫైనలియర్‌లో 59.9 ఉత్తీర్ణతా శాతంగా ఉంది. ఒకేషనల్ మొదటి సంవత్సరంలో ఇంటర్ (జనరల్)లో ఉత్తీర్ణతా శాతం 18.9గా ఉంది. మొదటి సంవత్సరం ఒకేషనల్‌లో ఉత్తీర్ణతా శాతం 26.7గా ఉంది.

కేశంపేట : ఇంటర్ ఫలితాల్లో కేశంపేట మండలం కొత్తపేట జూనియర్ కాలేజీ, కేశంపేట కేజీబీవీ విద్యార్థులు సత్తాచాటారు. కొత్తపేట జూనియర్ కళాశాలలో ఫస్ట్ ఇయర్ బైపీసీలో 78.12శాతం, సెకండియర్‌లో 100శాతం ఉత్తీర్ణత సాధించారు. సీఈసీ ఫస్టియర్‌లో 61 శాతం, సెంకడియర్‌లో 88.57శాతం ఉత్తీర్ణత సాధించారు. కేజీబీవీలో ఫస్టియర్ సీఈసీలో 86.49శాతం ఉత్తీర్ణత, సెంకడియర్‌లో 93.9శాతం ఉత్తీర్ణత, ఎంపీహెచ్‌డబ్ల్యూ ఫస్ట్ ఇయర్‌లో 100శాతం ఉత్తీర్ణత, సెకండియర్‌లో 100శాతం ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థులను కేశంపేట ఎంఈవో చంద్రశేఖర్, కేజీబీవీ ఎస్‌వో గౌసియా బేగంలు అభినందించారు.

షాద్‌నగర్ అర్బన్ : షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 72శాతం ఉత్తీర్ణతను సాధించారని ప్రిన్సిపల్ జి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇంటర్ ఎంపీహెచ్ డబ్ల్యూ ఫస్టియర్‌లో కె.మానస 500 మార్కులకు 493 మార్కులు సాధించినట్లు ఆయన తెలిపారు.

శంషాబాద్ రూరల్ : పాల్మాకుల మోడల్ జూనియర్ కళాశాలలో ఎంపీసీ సెకండియర్‌లో శరణ్య 979/1000, బైపీసీలో జెన్నీఫర్ 986/1000, సీఈసీలో శృతి సాహు 941/1000, ఎంఈసీలో పూర్ణేశ్వరి 809/1000 మార్కులు సాధించి ఔరా అనిపించారు. ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో సిరిచందన 455/470, బైపీసీలో ఈషా 423/440, సీఈసీలో టి.కావ్య 462/500, ఎంఈసీలో పి.స్పందన 363/500 మార్కులు సాధించి ప్రయివేట్ కళాశాలకు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ రజినీ తెలిపారు.

చేవెళ్ల : పట్టణ కేంద్రంలో తెలంగాణ మోడల్ కళాశాలలో ఎంపీసీ ఫస్టియర్‌లో ఇ.శృతిలయ 468/470 మార్కులు సాధించి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. వి.గాయత్రి 465 మార్కులు సాధించింది. సెకండియర్ ఎంపీసీలో సర్బజీత్ 974/100 మార్కులు సాధించాడు. మోడల్ కళాశాలలో ఫస్టియర్‌లో 122 మంది విద్యార్థులకుగాను 103 మంది ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్‌లో 142మందికి 81మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫస్టియర్‌లో 199 మంది విద్యార్థులకుగాను 108 మంది ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్‌లో 153 మందికిగాను 102మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామరావు తెలిపారు.

షాబాద్ : షాబాద్ తెలంగాణ మోడల్ జూనియర్ కళాశాలలో బాలికలు మంచి ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ కవిత వెల్లడించారు. సెకండియర్‌లో 72 శాతం, మొదటి సంవత్సరంలో 66 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. షాబాద్ మండలం మల్లారెడ్డిగూడకు చెందిన పరిగి శ్రీవర్షిని ఎంపీసీ సెకండియర్‌లో 992 మార్కులు సాధించింది. శ్రీచైతన్య బొంగుళూరు క్యాంపస్‌లో చదువుతోంది.

శంకర్‌పల్లి : శంకర్‌పల్లిలోని శ్రీవివేకానంద జూనియర్ కళాశాల ఎంపీసీ సెకండియర్‌లో నందిని 992/1000 మార్కులు సాధించి రాష్ట్రంలో ఐదో ర్యాంకు సాధించింది. బైపీసీలో సెకండియర్‌లో శ్రావణి 982-1000, సీఈసీలో పావణి 973-1000 మార్కులు సాధించారు. కళాశాల కరస్పాండెంట్ హన్మంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మోయిన్‌పాషలు విద్యార్థులను అభినందించారు.

అమ్మాయిలు అదుర్స్!

(5వ పేజీ తరువాయి)

మొదటి స్థానంలో నిలవగా, ఈసారి రెండో స్థానానికి చేరుకుంది. అలాగే సెకండియర్ ఫలితాలను పరిశీలిస్తే.. గత ఏడాది మూడో స్థానంలో నిలువగా ఈసారి నాలుగో స్థానానికి చేరుకుంది.

ఇదిలా ఉండగా ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ ఒకేషనల్ కోర్సుల్లోనూ బాలికలు సత్తా చాటారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో మొత్తం 3,445 విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 2,179 విద్యార్థులు పాస్ అయ్యారు. 63.25శాతం ఉత్తీర్ణత సాధించారు. 1,709 మంది బాలురు పరీక్షలు రాయగా 834 మంది పాస్ అయ్యారు. 48.04 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే 1,709 మంది బాలికలు పరీక్షలురాయగా 1,345 మంది పాస్ అయ్యారు. 78.70శాతం ఉత్తీర్ణత నమోదైంది.

ఇంటర్ సెకండియర్ ఒకేషనల్ పరీక్షల్లో మొత్తం 2,995 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 2,195 మంది పాస్ అయ్యారు. 73.29 శాతం ఉత్తీర్ణత సాధించారు. 1,521 మంది బాలురు ఒకేషనల్ పరీక్షలు రాయగా 901 మంది విద్యార్థులు పాస్ అయ్యారు. 59.24 శాతం ఉత్తీర్ణత సాధించారు. 1,478 మంది బాలికలు పరీక్షలు రాయగా 1,294 బాలికలు పాస్ అయ్యారు. 87.79 శాతం ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్ ఒకేషనల్ కోర్సుల్లోనూ బాలికలు సత్తా చాటారు.

ఒకేషనల్‌లో పెరిగిన ఉత్తీర్ణత

గత ఏడాది వెలువడిన ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ ఒకేషనల్ పరీక్ష ఫలితాలను పరిశీలిస్తే.. ఈ సారి ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో ఉత్తీర్ణత శాతం పెరిగింది. గత ఏడాది ఫస్టియర్‌లో 50.92 శాతం ఉత్తీర్ణత సాధించగా ఈసారి 63.25 శాతం నమోదైంది. గత ఏడాది కంటే ఈ సారి 12.33 శాతం పెరిగింది. సెకండియర్ ఒకేషనల్ పరీక్షల ఫలితాలను పరిశీలిస్తే.. గత ఏడాది 62.02 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, ఈ సారి 73.29 శాతం నమోదైంది. గత ఏడాది కంటే ఈ సారి 11.27 శాతం ఉత్తీర్ణత పెరిగింది.



ఉదగండ్ల లార్డు జెన్నిఫర్
గ్రూపు : బైపీసీ
మార్కులు : 986/1000
కళాశాల : టీజీఎంఎస్ పాలమాకుల, శంషాబాద్



జి.శరణ్య
గ్రూపు : ఎంపీహెచ్‌డబ్ల్యు
496/500
కస్తూర్బా బాలికా విద్యాలయం, కొందుర్గు



పేరు : మూడవత్ ఝాన్సీ
గ్రూపు : బైపీసీ
మార్కులు : 951/1000
కళాశాల : కొత్తపేట కళాశాల, కేశంపేట

'భూ భారతి'తో సమస్యలకు శాశ్వత పరిష్కారం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

మంచాల, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. భూ భారతి చట్టంపై మంగళవారం మంచాలలో వివిధ గ్రామాలకు చెందిన రైతులకు అవగాహన కల్పించారు. మల్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి ముఖ్యఅతిథిలుగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ధరణి పోర్టల్‌తో పేద రైతులకు అన్యాయం జరిగిందన్నారు. భూ భారతితో పేదరైతులకు న్యాయం జరుగుతుందన్నారు. ఆర్‌డీవో అనంతరెడ్డి, తహసీల్దారు ప్రసాద్‌రావు, ఎంపీడీవో బాలశంకర్, మాజీ సర్పంచులు విష్ణువర్ధన్‌రెడ్డి, మార్కెట్‌కమిటీ చైర్మన్ గుర్నాథ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, ఎల్లేష్, వెంకటేష్‌యాదవ్, జయమ్మ, చీమల జంగయ్య యాదవ్, శ్రీనివాస్‌నాయక్, రమాకాంత్‌రెడ్డి, మిద్దె శ్రీనివాస్ గౌడ్, మార సురేష్, గుడ్డిమల్ల చంద్రయ్య, మాసయ్యగౌడ్, సికిందర్‌రెడ్డి, నాగరాజు, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల కోసమే జైభీమ్ నినాదం

● బీజేపీ మండలాధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి

చౌదరిగూడ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సార్వత్రిక ఎన్నికలలో ఓట్లు, గెలుపు కోసమే కపటనాటకాలకు తెరలేపిందని బీజేపీ కొందుర్గు మండలాధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ నాయకులు మంగళవారం కొందుర్గులో నిర్వహించిన జైభీమ్, జైబాపు, జైసంవిధాన్ కార్యక్రమం దొంగే దొంగ దొంగ అని అరిచినట్లుగా ఉందన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. అంబేడ్కర్ మహనీయుడిని అవమానించడానికి అనేక కుట్రలు చేసిన కాంగ్రెస్ పార్టీ.. నేడు మంగళహారతులు పట్టడం సిగ్గులేని చర్యగా ఆయన అభివర్ణించారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాలరాసి దేశంలో ఎమర్జెన్సీ విధించిన నీచపు చరిత్ర కాంగ్రెస్ పార్టీదని ఆయన అన్నారు. అంబేడ్కర్‌కు భారతరత్న ఇవ్వని మీరా.. యాత్రలు చేసేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరుగ్యారెంటీలు అమలు చేయలేక.. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఆడుతున్న నాటకమని, కపట నాటకాలు మానుకొని 6గ్యారంటీలు, 66హామీలను అమలు చేయాలని సలహా ఇచ్చారు. కాంగ్రెస్ కుట్రలు చూసి అంబేడ్కర్ ఆత్మ ఘోషిస్తుందన్నారు.

బీజేపీవి కార్మిక వ్యతిరేక విధానాలు



శంషాబాద్ రూరల్ : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

మొయినాబాద్‌రూరల్/శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అమలుచేస్తోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అల్లి దేవెందర్ ఆరోపించారు. మంగళవారం సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో కార్మిక దినోత్సవం మేడే పోస్టర్ విడుదల కార్యక్రమంలో దేవెందర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. సీఐటీయూ మండల ఉపాధ్యక్షుడు అజీజ్‌నగర్ రత్నం, సుధాకర్, ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ అధ్యక్షులు మహేందర్, రాజేందర్, సాయి, లింగం, తదితరులున్నారు. అదేవిధంగా సీఐటీయూ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సమావేశమ య్యారు. ముఖ్య అతిథిగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్ హాజరై మేడేకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మే ఒకటిన అన్ని గ్రామాల్లో ఎర్రజెండా రెపరెపలాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షుడు ప్రవీణ్, జిల్లా సహాయ కార్యదర్శి డి.నాగేష్, జయేందర్, యాదమ్మ సంపత్, సత్తయ్య, గోపాల్, శ్రీనుసాగర్, సీఐటీయూ జిల్లా నాయకులు నీరటి మల్లేష్ పాల్గొన్నారు.

కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావాలి

శంషాబాద్ రూరల్/కందుకూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగాన్ని కాపాడాలంటే కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గడ్డం శేఖర్‌యాదవ్ అన్నారు. జైబాపూ, జైబీమ్, జైసంవిధాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని జూకల్, అల్లీకోల్‌తండా, పిల్లోనిగూడలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో దేశంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకొని రాజ్యాంగాన్ని కాపాడుకుందామని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే రాజ్యాంగాన్ని మార్చడానికి బీజేపీ ప్రభుత్వం కుట్రలు పన్నిందని ఏఎంసీ చైర్మన్ ఎస్.కృష్ణానాయక్, మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డిలు ఆరోపించారు. కందుకూరు మండలంలోని గూడూరు, కటికపల్లి, అన్నోజిగూడలో నిర్వహించిన జై బాపు, జై భీమ్, జైసంవిదాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏఎంసీ డైరెక్టర్లు కె.విష్ణువర్ధన్‌రెడ్డి, సురేందర్, నాయకులు ఎస్.వెంకటేష్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, ఎండీ సులేమాన్, అజ్జు, సరికొండ జగన్, బుక్క పాండురంగారెడ్డి, మాజీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



కందుకూరు : గూడూరులో మాట్లాడుతున్న కృష్ణానాయక్, జంగారెడ్డి



జెండా ఏర్పాట్లను పరిశీలిస్తున్న కంబాల పరమేశ్, గంప వెంకటేశ్

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

కడ్తాల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): హామీల అమలులో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కంబాల పరమేశ్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌లు అన్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఘోర పరాభవం తప్పదన్నారు. మక్తమాదారంలో మంగళవారం బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల విజయవంతంపై సమావేశం నిర్వహించారు. జెండావిష్కరణ ఏర్పాట్లను వారు పరిశీలించి సభకు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు. ఎల్కతుర్తిలో నిర్వహించే సభకు ఇంటికో జెండా, ఊరికో కారుతో ప్రజలు ఉప్పెనలా కదలాలన్నారు. సాయిలు, చంద్రమౌళి, గణేశ్, శ్రీనివాస్‌గౌడ్, జెనిల్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల రీవెరిఫికేషన్

కేశంపేట, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇందిరమ్మ ఇళ్ల రీవెరిఫికేషన్ కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. మండలంలోని చౌలపల్లి, కేశంపేట, బొదునంపల్లి, కాకునూర్, పాటిగడ్డ, లేమామిడి గ్రామ పంచాయతీలలో ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి పర్యవేక్షణలో అధికారులు రీ వెరిఫికేషన్ చేశారు. ఇందరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసిన వారి ఇళ్లలకు వెళ్లి వారి ఆర్థిక పరిస్థితులు పరిశీలిస్తున్నారు. వారు నివసిస్తున్న ఇళ్లు ఎలా ఉన్నాయోనని పరిశీలించారు. వివరాలను నమోదు చేశారు. ఎంపీవో కిష్టయ్య, పీఆర్ఏఈ నర్సింగరావు, డీటీ గీత, ఇరిగేషన్ ఏఈ గీతలు వివరాలు సేకరించారు.

జాబితా పరిశీలనకు అధికారుల నియామకం

ఆమనగల్లు : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా స్థానిక ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇచ్చిన జాబితాలలోని లబ్దిదారుల గుర్తింపుకు గ్రామాలవారిగా పరిశీలనకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు ఎంపీడీవో కుసుమ మాధురి తెలిపారు. ఈనెల 28 వరకు లబ్దిదారుల గుర్తింపు కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. పోలెపల్లిలో మంగళవారం ఎంపీడీవో పర్యటించారు. గ్రామ వెరిఫికేషన్ అధికారి, ఎంపీవో వినోద, ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి ఇందిరమ్మ జాబితాలను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలు సేకరించారు. చింతపల్లి, చెన్నంపల్లి, శంకర్ కొండ తండాలకు ఎంపీవో వినోద, కోనాపూర్, రాంనుంతల, సింగంపల్లికి ఏఈ శరత్, ఆకుతోటపల్లి, సీతారామ్ నగర్ తండా, శెట్టిపల్లికి పీఆర్ ఏఈ అభిషేక్, మంగళపల్లి, మేడిగడ్డ, పోలెపల్లి, కొత్త కుంట తండాలకు మైనర్ ఇరిగేషన్ ఏఈ తిరుపతయ్య లను వెరిఫికేషన్ అధికారులుగా నియమించినట్లు మాధురి వివరించారు. పోలెపల్లి పంచాయతీ కార్యదర్శి పవన్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నంను కలిసిన యూత్ కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ, రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మంగళవారం యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామ రాజేశ్, కల్వకుర్తి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షాబోద్దీన్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. గాంధీభవన్‌లో పొన్నంను కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి అసెంబ్లీలో ఆమోదించడంలో చొరవ తీసుకున్న మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. బీసీ బిల్లు ఆమోదం కాంగ్రెస్ ప్రభుత్వ సాహసోపేత నిర్ణయమని, ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకుపోవాలని మంత్రి సూచించినట్లు రాజేశ్, షాబోద్దీన్‌లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో నాయకులు రమేశ్, శివ, ప్రసాద్ తదితరులున్నారు.

ఘనంగా ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం

కడ్తాల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎక్వాయిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వార్షికోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు కావలి రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సాంస్కృతి కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాస్, పాఠశాల చైర్మన్ కౌసల్య, టీచర్లు విజయభారతి, సునిత, సంగీత, ఉపాధ్యాయ సంఘం నాయకులు శంకర్, మల్లయ్య, శ్రీనివాసులు, కృష్ణ, శ్రీరాములు పాల్గొన్నారు.

'ఉపాధి' డబ్బులు చెల్లించాలి

షాద్‌నగర్ రూరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు పెండింగ్ డబ్బులు చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను నాయక్ డిమాండ్ చేశారు. ఫరూఖ్‌నగర్ మండలం కడియాలకుంట తండాలో జరుగుతున్న ఉపాధి పనుల వద్దకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. 9 వారాలుగా డబ్బులు చెల్లించడం లేదని కూలీలు తెలిపారు. పని ప్రదేశంలో కనీస వసతులు కల్పించడం లేదని, ఇప్పటికే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని శ్రీనునాయక్ తెలిపారు.

యువత క్రీడల్లో రాణించాలి

కందుకూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణించాలని, గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న టోర్నమెంట్లలో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొనాలని యువజన కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్‌గౌడ్ తెలిపారు. మండల కేంద్రంలోని మినీస్టేడియంలో స్థానిక యువకులు ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో పాటు ఇలాంటి టోర్నమెంట్లు ఎంతో దోహదపడతాయన్నారు. 8టీమ్‌లు ఈ పోటీల్లో పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వనం సురేష్, రఘుబాబు, అజీజ్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

మంచాల : అణువణువునా జాతీయవాదం నింపుకున్న కాషాయవీరుడు షహీద్ మహేందర్‌గౌడ్ అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.లచ్చిరెడ్డి, క్రమశిక్షణాసంఘం సభ్యుడు బోసుపల్లి ప్రతాప్‌లు కొనియాడారు. షహీద్ మహేందర్‌గౌడ్ 20వ వర్ధంతిని మంగళవారం మంచాల మండల పరిధిలో బీజేపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. తాళ్లపల్లిగూడలోని మహేందర్‌గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దేశంకోసం, ధర్మంకోసం కడదాకా పరితపించిన దేశభక్తుడు మహేందర్‌గౌడ్ అని గుర్తుచేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దన్నె బాషయ్య, మండలాధ్యక్షుడు నూకం రాజు, మారగోని శ్రీశైలం, చిదిరాల పాండు, పాండాల జంగయ్య, కొంగర జనార్ధన్‌రెడ్డి, మెండు వెంకటరెడ్డి, కొండర్, శేఖర్‌రెడ్డి, సత్తిరెడ్డి, ముత్యంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : దివంగత ఇంద్రారెడ్డి ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చేసిన సేవలు మరువరానివని దాసర్లపల్లి మాజీ సర్పంచ్ టి.దేవేందర్, దెబ్బడగూడ మాజీ సర్పంచ్ డి.జంగయ్య, దాసర్లపల్లి మాజీ ఎంపీటీసీ ఇందిరలు అన్నారు. మంగళవారం ఇంద్రారెడ్డి 25వ వర్ధంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బదిరుల ఉన్నత పాఠశాల విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇంద్రారెడ్డి అడుగుజాడల్లో మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి నడుస్తూ... నియోజకవర్గ ప్రజలకు రాజకీయాలకు అతీతంగా సేవలందిస్తున్నట్లు గుర్తుచేశారు. ఆర్.శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లి : మండల కేంద్రం ఏర్పాటు కోసం గట్టిప్పలపల్లి గ్రామస్థులు పోరాటం ఉధృతం చేశారు. పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ చేపట్టిన రిలే నిరహార దీక్షలు మంగళవారం 168వ రోజుకు చేరాయి. దీక్షల్లో జేఏసీ నాయకులు, వివిధ పార్టీల నేతలు, యువకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. నిరసన ర్యాలీ నిర్వహించారు.